క్లుప్తంగా

బైక్ రేస్‌లకు పాల్పడితే కేసులు



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మహేష్, సీఐ అబ్దుల్ కరీం

హిందూపురం అర్బన్: రోడ్లపై బైక్ రేస్‌లు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం, ప్రమాదాలకు కారణమయ్యే వారెవరైనా వదలిపెట్టే ప్రసక్తి లేదని డీఎస్పీ కేవీ మహేష్ హెచ్చరించారు. శనివారం రెండో పోలీస్ స్టేషన్ ఆవరణలో పలువురు ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణంలోని పలువురు బైక్ రేస్‌లు చేస్తూ ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. గతంలో రిలయన్స్ బంక్ సమీపంలో ఓ చిన్నారి మరణానికి కారణంగా మారిందని.. బైపాస్ రోడ్డు, కొడికొండ చెక్‌పోస్టు–శిర రహదారిలో బైక్ రేస్‌లు చేస్తున్నారు. ఇకపై వారి ఆటలు సాగవన్నారు. ఎవరైనా ద్విచక్ర వాహనాల్లో విన్యాసాలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తే నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీఐ అబ్దుల్ కరీం మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపినా.. బైక్‌లపై విన్యాసాలు చేస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగించినా .. ప్రమాదాలకు కారణంగా మారినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్పెయిన్ దేశస్తురాలి పర్యటన



దత్తత తీసుకున్న గిరీష్‌తో ముచ్చటిస్తున్న డాక్టర్ సంద్ర

రొళ్ల: మల్లసముద్రం గ్రామంలో శనివారం స్పెయిన్ దేశస్తురాలు డాక్టర్ సంద్ర పర్యటించారు. గ్రామంలో ఆమె దత్తత తీసుకున్న గిరీష్, అతడి తల్లిదండ్రులు సరదాగా గడిపారు. ప్రస్తుతం బీజీ హళ్లి ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న బాలుడు గిరీష్‌కు విద్య సామగ్రితో నిత్యవసరాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పెయిన్ దేశానికి చెందిన డాక్టర్ సంద్రకు గిరీష్ కుటుంబ సభ్యులు నుదుటిపై బొట్టు పెట్టి శాలువా కప్పి, పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఆర్డీటీ ఏటీఎల్ ఓబుశేష్, సీడీసీ మెంబర్లు, ఆర్డీటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించండి



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రాఘవన్

సోమందేపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను పెనుకొండ సీఐ రాఘవన్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పెండింగ్ కేసులపై ఎస్‌ఐ రమేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. మట్కా, పేకాట, మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మూలించాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై తరచుగా అవగాహన కల్పించాలన్నారు. పాత కేసుల్లో ముద్దాయిలు, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించాలని సిబ్బందికి సూచించారు.

నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభం



నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో శనివారం నూతన ఆర్టీసీ బస్సును స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు ప్రారంభించారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చౌటిపల్లి, సదాశివాపురంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్లు అందించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పావగడకు చెందిన జపానందస్వామి శారదాదేవి కంటి ఆస్పత్రి, స్వామి వివేకానంద సంఘటిత ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, నయోనిక ఐకేర్ చారిటబుల్ ట్రస్ట్, సిద్ధార్థ, శ్రీదేవి మెడికల్ కళాశాలలు సంయుక్తంగా శిబిరాన్ని నిర్వహించాయి. కార్యక్రమంలో జపానందస్వామి, ప్రిన్సిపాల్ సుజాత, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మడకశిర మండలం శివాపురంలో జ్యోతుల ఉత్సవాలు నిర్వహిస్తున్న మహిళలు



అమరాపురం మండలం ఆలదపల్లిలో జ్యోతులు మోస్తున్న దృశ్యం



గుడిబండ మండలం ఫలారంలో జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఆలయాల్లో శ్రావణ శోభ

శ్రావణమాసం నాలుగో శనివారం ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శ్రావణ పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలను చేశారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పలు గ్రామాల్లో జ్యోతులు, బోనాల ఉత్సవాలు చేపట్టారు.



రొళ్ల : అలంకరణలో శనేశ్వరస్వామిని



లేపాక్షిలో ఆంజనేయస్వామి



హిందూపురంలోని డీబీ కాలనీలో శనీశ్వరస్వామి



బద్రీనాథుడి అలంకరణలో పేట వెంకటేశ్వరస్వామి



రాముడి అలంకరణలో కోట ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా శివాపురంలో మహిళలు అంజినేయస్వామికి జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట అంజినేయస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కల్లుమర్రి వీరకేతమ్మ, నీలకంఠేశ్వరస్వామి, సింగేపల్లి, చందకచెర్లు ఆంజనేయస్వామి, జమ్మానిపల్లి లక్ష్మీనిడిమామిడమ్మ తదితర ఆలయాల్లో స్వామివార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

రొళ్ల: ఆఖరి శ్రావణ మాసం శనివారం సందర్భంగా స్థానిక శనేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి సుప్రభాత సేవలు అంకురార్పణ తదితర పూజలు చేశారు. శనేశ్వరుని మూల విగ్రహానికి పంచలోహ కావచాలతో పాటు వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసువచ్చి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామికి సమర్పించారు. అనంతరం విగ్రహం ఎదుట నల్లటి నువ్వులతో జ్యోతులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

అగళి : కోడిపల్లి,అగళి ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలూడి గ్రామంలో శనేశ్వరసామికి భక్తులు జ్యోతుల ఉత్సవం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అమరాపురం: చివరి శ్రావణ శనివారం సందర్భంగా ఆలదపల్లిలో డప్పు వాయిద్యాల నడుమ జ్యోతులతో ఊరేగింపుగా ఆంజనేయస్వామికి ఆలయానికి చేరుకుని స్వామికి సమర్పించారు. స్వామివారిని ప్రత్యేకంగా వెండి కవచంతో అలంకరించిన పూజలు చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తమ్మడేపల్లి, గౌడనకుంట, అమరాపురం చెరువు కట్ట ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడిబండ: శ్రావణ మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని ఫళారం గ్రామంలో ఆంజనేయస్వామి జ్యోతుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మేళతాళాలు, వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి జ్యోతులను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహానికి వివిధ పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

లేపాక్షి: శ్రావణమాసం పురస్కరించుకుని శనివారం మండల వ్యాప్తంగా వున్న వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాటన్‌ను అలంకరించి విశేషంగా పూజలు చేశారు.

హిందూపురం: శ్రావణ మాసం చివరి శనివారం త్రయోదశి శనివారం పురస్కరించుకుని డీబీ కాలనీ, టీచర్స్‌కాలనీలోని శనీశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. అలాగే జైష్ఠదేవి సమేత శనేశ్వరుడి ఉత్సవ మూర్తులను ప్రాకారోత్సవం నిర్వహించారు. స్థానిక పేట వేంకటరమణ స్వామి దేవస్థానంలో ఉదయం మూలవిరాట్ వెంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు చేసి విశేషంగా బద్రీనాథుడి అలంకరణతో పూజలు చేశారు. మహా మంగళ హారుతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పొంగళి నైవేద్యాన్ని అందజేశారు. అనంతరం అలాగే శ్రీదేవి భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి మంగళ వాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. అలాగే కోట ఏరియాలోని ఆంజనేయస్వామి ఆలయం, గడ్డమీద ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీ వద్ద వెలసిన అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం కాలనీవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

ఉత్సవాలకు ముస్తాబవుతున్న నిడుగల్ దుర్గం



నిడుగల్ దుర్గం

పావగడ: తాలూకా లోని చారిత్రాత్మక పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన నిడుగల్ దుర్గం ఉత్సవాలు వచ్చే సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు నిడుగల్ దుర్గం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఏటా శ్రావణ మాసం చివరి సోమవారం నిర్వహించే నిడుగల్ ఉత్సవాలు ఈ సారి కూడా జోరుగా నిర్వహించేందుకు నిడుగల్ ఉత్సవ సమితి నాయకులు తీవ్ర ఉత్సాహం చూపుతున్నారు. నిడుగల్ దుర్గంలోని రామతీర్థం ప్రాంతంలో పెద్ద ఎత్తున వేదిక నిర్మిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సాగే ఈ ఉత్సవాల్లో జానపద కళాకారులు వివిధ జానపద కళా రూపాలతో అందర్నీ అలరించనున్నారు. నిడుగల్ ఉత్సవాలకు అందరూ తరలి రావాలని ఉత్సవ సమితి నాయకులు కోరారు.

రేపు వైఎస్సార్ వర్ధంతి

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. మడకశిరలో వైఎస్సార్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించాలని ఆయన కోరారు.

అగళి: మండల కేంద్రంలోని సోమవారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ స్టూడీయె శ్రీనివాస్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరవుతారని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 13 పంచాయతీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

గుడిబండ: మండల కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

అమరాపురం: మండల కేంద్రంలోని శిర రోడ్డులో ఉన్న వైఎస్సార్ సర్కిల్ వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ 15వ వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

కేసుల పరిష్కారానికి సహకరించండి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

హిందూపురం అర్బన్: రాజీ కాదగిన కేసుల పరిష్కారానికి పోలీసులు సహకరించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ కోరారు. శనివారం అదనపు జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీతో కలసి పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 14న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. పోలీసులు తమ పరిధిలో వీలైనంత మేరకు ఎక్కువ కేసులు పరిష్కరించేలా దృష్టి సారించాలన్నారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు కక్షిదారులకు వివరించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయం వృథా చేసుకోవద్దని సూచించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.వి. మహేష్, ఏపీపీ ఇందాద్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, సీఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీం, జనార్ధన్, ఎస్ఐలు మునీర్ అహ్మద్, గోపి పాల్గొన్నారు.

నేటి నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

మడకశిర: గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం నుంచి విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మద్దిలేటి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఎలక్ట్రికల్ కాడ్, పీఎల్‌సీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. 45 రోజుల పాటు కోర్సులు జరుగుతాయని, రూ.1500 చొప్పున విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఐటీఐ, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు, బీటెక్ చదువుతున్న లేదా పూర్తి చేసిన విద్యార్థులు, పాలిటెక్నిక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు టెక్నికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మడకశిర: పట్టణంలోని వాసవీ మహల్‌లో శనివారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామిని ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక 'జామియా మసీదు'



హిందువులను సన్మానిస్తున్న జామియా మసీదు కమిటీ నిర్వాహకులు

హిందూపురం అర్బన్: పట్టణంలో జామియా మసీదు నిర్మాణంలో పాలుపంచుకుని మత సామరస్యం చాటి హిందువులు ఆదర్శంగా నిలిచారు. జామియా మసీదు కమిటీ, ముస్లిం మత పెద్దలు నూరుల్లా ఖాన్, షఫీ, తలహాక్‌ఖాన్, బాషా, అయూబ్, ఖలీల్, ముస్తాఫా ల ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో హిందువులు పాల్గొన్నారు. అఖిల భారత షహీద్ టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్‌ఖాన్ మాట్లాడుతూ మసీదు నిర్మాణంలో కుల మతాలకు అతీతంగా పాల్గొని మత సామరస్యం చాటిన సోదరులకు జామియా మసీదు కమిటీ, ముస్లీం సమాజం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సిమెంట్, కంకర వేసి నిర్మాణంలో భాగస్వామ్యం వహించి తోడ్పాటు అందించారన్నారు. వారిని గౌరవించి హిందూ, ముస్లిం, సిఖ్ ఇసాయియా భాయి భాయి అని నినదించారు. అనంతరం శాలువాలతో హిందువులను సన్మానించారు. కార్యక్రమంలో జేఈ వెంకటస్వామి, భాస్కర్, నాగేందర్, ఉదయ్, జేపీకే రాము, నవీన్, నరోసజీ రావు, నాయక్, అంజనేయులు, రవి, శ్రీరాములు, డిఈ. రమేష్, శివశంకర్, శంకర్, నాగరాజు, అజమతుల్లా, జబీవుల్లా, అన్వర్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



వెలుగు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ సిబ్బంది

రొళ్ల: మొక్కలు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని వెలుగు కార్యాలయం ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వనమహోత్సవం, 'తల్లి పేరు మీద ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా అంగనవాడీ వర్కర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. ప్రతి ఒక్కరు కూడా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అంగనవాడీ వర్కర్లు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. శనివారం ఆయన కదిరేపల్లి, మెళవాయి గ్రామాల్లో లబ్ధిదారులకు సామాజిక భద్రత పింఛన్‌ను పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఉద్యోగులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ పేమెంట్ బ్రాంచ్‌లో వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

హిందూపురం: హిందూపురం హెడ్‌పోస్టాఫీసులో ఐపీబీ పోస్ట్ పేమెంట్ బ్రాంచ్ ప్రారంభించి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో బ్రాంచ్ సీనియర్ మేనేజర్ మురళి ఆధ్వర్యంలో బ్రాంచ్ ఆఫీసులో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, హెడ్ పోస్ట్‌మాస్టర్ మార్కండేయులు హాజరై కేక్ కట్ చేశారు. సీనియర్ మేనేజర్ మురళి మాట్లాడుతూ ఇప్పటి వరకూ 2.14లక్షల అకౌంట్లు ఉన్నాయని, అందుల్లో ప్రమాదవశాత్తు మరణించిన నలుగురి కుటుంబాలకు డీపీటీ ద్వారా రూ.1.5 కోట్లు ఖాతాదారులకు అందజేశామన్నారు. ఐపీబీ మేనేజర్ బాలకృష్ణ, పోస్టల్ సూపరింటెండెంట్ విజయకుమార్ పాల్గొన్నారు.

ఈఓఆర్‌డీకి వీడ్కోలు



ఈఓఆర్‌డీ సుధాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల: ఉద్యోగులు ఆయా రంగాల్లో ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల ఈఓఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సుధాకర్‌ను తోటి ఉద్యోగులతో పాటు ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అలాగు మండల పరిధిలోని బూదిలి ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జనార్ధన రెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి ఉపాధ్యయులు, మిత్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో డీఎల్‌డీఓ శివారెడ్డి, ఎంపీడీఓ రఘునాథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానులే



మాట్లాడుతున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టం దృష్టిలో అందరు సమానులేనని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని మానేపల్లి లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ మాట్లాడుతూ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా కుల విద్వేష, పౌరహక్కులకు భంగం కలిగితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపి, గ్రామ పెద్దలు వేణుగోపాల్‌రెడ్డి, నారాయణప్ప, రామచంద్రప్ప, అధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వసతులు మెరుగు

లేపాక్షి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించామని ప్రిన్సిపాల్ సుందరరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులపై అధికారులు, సిబ్బందిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మరుగుదొడ్లను శుభ్రపరచడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. విద్యార్థులు దుస్తులు ఆరవేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. తాగునీటి ప్రదేశంలో పరిశుభ్రత, బియ్యం శుభ్రపరిచేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి వసతి గృహంలో ఫ్యాన్‌లు ఏర్పాటు చేశామని, మరిన్ని ఫ్యాన్‌ల కొనుగోలుకు గురుకుల సంస్థ కార్యదర్శికి నివేదిక పంపామన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబులుతున్న నేపథ్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయిస్తున్నామని, అవసరమైతే వైద్య శిబిరం ఏర్పాటు చేయిస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రైవర్లకు సన్మానం

మడకశిర: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లుగా పని చేస్తున్న అశ్వత్థప్ప, గంగిరెడ్డి శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆర్టీసీ కార్మికులు వారిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు అశ్వత్థప్ప, గంగిరెడ్డి సేవలను కొనియాడారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండెక్టర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

శనీశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే

పావగడ: స్థానిక శనీశ్వరాలయాన్ని శనివారం చిక్కనాయకనహళ్లి విధాన సభ క్షేత్రం ఎమ్మెల్యే సురేశ్‌కుమార్ దర్శించుకున్నారు. ఈసందర్భంగా శనీశ్వరస్వామి కి సర్వ సేవా పూజలు, శీతలాంభదేవి కి సహస్ర కుంకుమార్చన చేయించారు. ఆలయ సమితి పదాధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప, నాయకుడు మను మహేశ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

లేపాక్షి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఇందిరను ఘనంగా సన్మానించారు. శనివారం సాయంత్రం జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంకు జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మెకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

హిందూపురం: లేపాక్షి ఆలయ చైర్మన్ రామనందన్ జన్మదిన వేడుకలను హిందూపురంలోని ఆయన అభిమానులు, సన్నిహితులు హిందూపురంలోని రూప వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలోని వృద్ధాశ్రమంలో రామనందన్ సన్నిహితులు వృద్ధుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సడ్లపల్లి వెంకటేష్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి దుర్గ నాని, నాగేపల్లి వెంకటరామిరెడ్డి నింకంపల్లి బాలకృష్ణ, బ్రహ్మానందరెడ్డి, బాలకృష్ణ రెడ్డి, ఆశ్రమం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ బ్రాంచ్ ఏర్పాటు చేయండి

మడకశిర: ఆమిదాలగొంది గ్రామంలో ఆంధ్ర ప్రగతిగ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు జీఎం రంజిత్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు శనివారం మడకశిరలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. బ్రాంచ్ ఏర్పాటు సాధ్ సాధ్యాలను పరిశీలిస్తామని జీఎం తెలిపారు. ఇదిలా ఉండగా మడకశిరలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌ను శనివారం నూతన భవనంలోకి మార్పు చేశారు. జీఎం రంజిత్‌కుమార్ బ్యాంక్ నూతన భవనాన్ని ప్రారంభించారు. బ్యాంకు ఆర్ఎం రమేష్, మడకశిర మేనేజర్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, ఖాతాదారులు పాల్గొన్నారు.

గొర్రెను ఢీకొన్న అంబులెన్స్

సోమందేపల్లి: మండల కేంద్రంలోని స్నేహలత నగర్ వద్ద పెట్రోల్ బంక్ ఎదుట గొర్రెను అంబులెన్స్ ఢీకొన్న ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. గొర్రెల యజమాని కేశవ అటవీ ప్రాంతం నుంచి గొర్రెలను ఇంటికి తీసుకెళ్తున్నాడు. పెనుకొండ వైపు నుంచి హిందూపురం వెళ్లే అంబులెన్స్ ఢీకొనడంతో గొర్రె మృతి చెందింది. గొర్రెల యజమాని అంబులెన్స్ డ్రైవర్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. అంబులెన్స్‌లో రోగులు ఉండటంతో అక్కడున్న వారు కలుగ చేసుకుని ఇద్దరికి సర్ది చెప్పి పంపారు.